సాక్షి
అనకాపల్లి
సోమవారం : 19 : ఫిబ్రవరి : 2024



'పీఎం శ్రీ'తో పరిపుష్టి

పీఎంశ్రీలో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. ఎంపికైన ఉన్నత పాఠశాలలను కాలేజీలుగా అభివృద్ధి చేయనున్నారు. 8లో



ఘనంగా పుష్పయాగం

ఆర్.వై.అగ్రహారంలో శ్రీ సీతారాములకు 1500 కిలోల వివిధ రకాలైన పుష్పాలతో పుష్పయాగం ఘనంగా జరిగింది. 8లో



'సెపక్ తక్రా ' ఎంపిక

దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెపక్ తక్రా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఆదివారం రసవత్తరంగా జరిగింది. 8లో



పారాచూట్ సాయంతో దిగుతున్న కమాండోలు

ఔరా.!

- అబ్బురపరిచిన నేవీ రిహార్సల్స్
- కిటకిటలాడిన ఆర్.కె.బీచ్

విశాఖ మరో అంతర్జాతీయ వేడుకకు సిద్ధమైంది. భారత నౌకాదళం సారథ్యంలో సోమవారం నుంచి ఈ నెల 27 వరకు జరగనున్న మిలాన్–24కు తూర్పు నావికాదళం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మిలాన్‌లో భాగంగా 22న జరగబోయే హార్బర్ ఫేజ్ విన్యాసాలకు సంబంధించి ఆదివారం ఆర్.కె.బీచ్‌లో నిర్వహించిన రిహార్సల్స్ అద్భుతంగా సాగాయి. యుద్ధ సమయంలో నావికాదళం ఎలా స్పందిస్తుంది? శత్రువులపై ఎలా ఎదురుదాడికి దిగుతుందో విన్యాసాల రూపంలో కళ్లకు కట్టినట్లు చూపించారు. తమ సత్తాను చాటుతూ.. నింగి, నేల, నీటిపై.. మన కమాండోలు చేసిన ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. గగనంలో యుద్ధ విమానాలు చక్కర్లు కొడుతూ బాంబులు వేయడం వంటి విన్యాసాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. నేవీ విద్యార్థులు జాతీయ, నేవీ గీతాలకు చేసిన నృత్య ప్రదర్శన, నేవీ సిబ్బంది బ్యాండ్ ప్రదర్శన, దేశ రక్షణ బలగాలతో కూడిన కవాతును చూసేందుకు పెద్ద ఎత్తున నగర ప్రజలు ఆర్.కె.బీచ్‌కు తరలివచ్చారు. సాయంత్రం సమయంలో సముద్రంలో యుద్ధ నౌకలు విద్యుత్ వెలుగులతో కనువిందు చేశాయి. సందర్శకులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక గ్యాలరీలు సిద్ధం చేశారు.

– బీచ్‌రోడ్డు





ఆకాశంలో విన్యాసాలు





నృత్య సాధన చేస్తున్న నేవీ విద్యార్థులు





మిలాన్ రిహార్సల్స్‌లో భాగంగా కవాతు చేస్తున్న రక్షణ బలగాలు



విన్యాసాలను తిలకిస్తున్న నగర ప్రజలు

న్యూస్‌రీల్

ఉపమాక వెంకన్నను దర్శించుకున్న ఎస్పీ



ఉపమాకలో బేడామండపం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ఎస్పీ కుటుంబ సభ్యులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఎస్పీ కె.వి.మురళీ కృష్ణ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు, దేవస్థానం సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ కుటుంబ సభ్యులు బేడామండపం చుట్టూ ప్రదక్షిణ చేసి, స్వామి వారి ఉత్సవ మూర్తులను, క్షేత్రపాలకుడు వేణు గోపాలస్వామిని, ఆండాళ్లమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు.. గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అండాళ్లమ్మవారి సన్నిధిలో వేదాశ్వీరచనం, శేష వస్త్రాలు, స్వామివారి చిత్రపటాలను అర్చక స్వా మి కృష్ణమాచార్యులు ఎస్పీ దంపతులకు అందజేశారు. ఎస్పీ వెంట నక్కపల్లి, అడ్డురోడ్డు సీఐలు విజయ్‌కుమార్, అప్పన్న ఉన్నారు.

'అనకాపల్లి' పేరుతో త్వరలో సినిమా

దర్శకుడు నక్కిన త్రినాథరావు



మాట్లాడుతున్న నక్కిన త్రినాథరావు

అనకాపల్లి: సొంత నిర్మాణ సంస్థ నక్కిన నరేటివ్స్ బ్యానర్‌పై 'అనకాపల్లి' పేరుతో కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు ప్రముఖ సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నటీనటుల ఎంపిక(అడిషన్స్), చిత్రీకరణ అనకాపల్లిలో జరుగుతాయన్నారు. తన సినీ జీవిత ప్రస్థానానికి బీజంపడింది గౌరీగ్రంథాలయంలోనేని ఆయన చెప్పారు. సినిమాలకు సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయంలోనే చదు వుకున్నట్టు తెలిపారు. సినీ పరిశ్రమ '0' గ్యారంటీ అని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగ నియామ కాల పోటీ పరీక్షలు, వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు గ్రంథాలయంలో నిర్వహిస్తుండడం వల్ల చాలా మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, సినీనటుడు బాలాజీ బద్రీనాథ్, సభ్యు లు దాడి ఈశ్వరరావు, కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ జగ్గఅప్పారావు, సురేష్, శీలా జగన్నాథరావు పాల్గొన్నారు.

జంప్ జిలానీలకే పెద్దపీట!

- 'సుందరపు' ఫ్యామిలీకి పెరిగిన ప్రాధాన్యత
- గాజువాక సీటు తనకేనని చెప్పుకుంటున్న సతీష్
- అనకాపల్లి ఎంపీగా నాగబాబు పోటీ చేస్తారని లీకులు
- ఆయన కుమార్తె సినిమాకు సతీష్ పెట్టుబడి అంటూ ప్రచారం
- తమను దూరం పెట్టారంటూ పార్టీలో సీనియర్ల తీవ్ర అసహనం
- అసంతృప్తితో రగిలిపోతున్న జనసేన శ్రేణులు



సాక్షి, విశాఖపట్నం : ఇప్పటికే టీడీపీతో పొత్తుపై కత్తులు నూరుతున్న జనసేన శ్రేణులు ఇప్పుడు ఆ పార్టీలో అగ్ర నాయకుల వ్యవహార శైలిపై తీవ్ర అసహనంతో ఉన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేస్తున్న తమను కాదని నిన్నగాక మొన్న చేరిన జంప్ జిలానీలకు పెద్దపీట వేస్తున్నారంటూ రగిలిపోతున్నారు. కేవలం డబ్బుకే ప్రాధాన్యమిస్తున్నారు తప్ప పార్టీలో సేవలకు గుర్తింపు లేదంటూ ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కొన్నాళ్ల క్రితం వరకు కొన్ని చోట్ల ఒకింత ఉత్సాహంగా కనిపించిన జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రస్తుత పరిణామాలతో నిర్లిప్తత, నైరాశ్యంతో కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో పాటు ఆయన సోదరుడు నాగబాబుల వైఖరిపై గుర్రుగా ఉన్నారు. పవన్ సామాజికవర్గానికి చెందిన యలమంచిలి నియోజకవర్గానికి చెందిన సుందరపు విజయ కుమార్ గతం నుంచే జనసేనలో ఉన్నారు. అప్పటికే జనసేన సానుభూతిపరుడిగా ఉన్న ఆయన సోదరుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి, పోర్టు కాంట్రాక్టరు సతీష్ పార్టీలో చేరుతున్నారంటూ ఆకస్మికంగా (డిసెంబర్ 7న) పవన్ కల్యాణ్‌తో విశాఖలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఇది జనసేన నేతలను సైతం ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ తర్వాత నుంచి అదే సామాజికవర్గానికి చెందిన 'సుందరపు' కుటుంబానికి పవన్, నాగబాబులు అధిక ప్రాధాన్యమిస్తున్నారంటూ పార్టీలో చర్చ మొదలైంది. సతీష్ తాను నాగబాబుకు అత్యంత సన్నిహితునిగా చెప్పుకోవడం, అందుకు తగ్గట్టే నాగబాబు వ్యవహార శైలి ఉండడం పార్టీలో ఇతర నాయకులకు మింగుడు పడడం లేదు. టీడీపీతో పొత్తులో భాగంగా గాజువాక సీటు తమకు ఖరారైందని, ఆ స్థానం నుంచి సతీష్ పోటీ చేయబోతున్నారంటూ కొద్ది రోజుల నుంచి విస్తృత ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి నాగబాబు బరిలో ఉంటారన్న ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

నాగబాబు కుమార్తె సినిమాకు సతీష్ పెట్టుబడి

నాగబాబు కుమార్తె తీస్తున్న ఓ సినిమాకు సతీష్ భారీగా పెట్టుబడి పెట్టారని, అందుకే సతీష్ సోదరులిద్దరికీ పార్టీలో ప్రాధాన్యత నిస్తున్నారని, సతీష్‌కు గాజువాక సీటు దక్కేలా చూస్తున్నారని జనసేన నాయకులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. పోర్టు కాంట్రాక్టరు కూడా అయిన సతీష్ గాజువాక సీటు నుంచి గెలిస్తే గంగవరం పోర్టుపై పట్టు సాధించవచ్చన్నది వారి వ్యూహంగా ఉందని పార్టీలో కొందరు చర్చించుకుంటున్నారు. ఒకవేళ అదే జరిగితే గాజువాక సీటుపై కోటి ఆశలు పెట్టుకున్న టీడీపీ నాయకుడు పల్లా శ్రీనివాసరావు పరిస్థితి ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది.

క్యాడరును పట్టించుకోని పవన్

అధినేత పవన్ విశాఖ వచ్చినప్పుడు తమను ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ జనసేన క్యాడరు అసంతృప్తితో ఉంది. ఎవరో ఒకరిద్దరికే కలిసే అవకాశం ఇవ్వడం, హోటల్ గదికే పరిమితమవ్వడం తప్ప మిగతా వారిని దరికి చేరనీయడం లేదని మధన పడుతున్నారు. ప్రజారాజ్యంలోనూ నాగబాబు ఇదే తీరును ప్రదర్శించారని, ఇప్పుడూ అదే జరుగుతోందని వీరు గుర్తు చేస్తున్నారు.

జీర్ణించుకోలేకపోతున్న సీనియర్లు..

మరోవైపు పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పని చేస్తున్న వారిని పక్కనబెట్టి పార్టీలు మారి వచ్చిన వారికి ప్రాధాన్యతనిస్తున్నారంటూ జనసేన సీనియర్లు రగిలిపోతున్నారు. ఇప్పటికే సుందరపు కుటుంబానికిస్తున్న ప్రాధాన్యతపై గుర్రుగా ఉన్న ఆ పార్టీ నాయకులు తాజా పరిణామాలతో మరింతగా అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణలు జనసేనలో చేరారు. వీరిలో పంచకర్లకు పెందుర్తి సీటు ఖాయమన్న ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో ఇన్నాళ్లూ ఆ సీటును ఆశిస్తున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌కు మింగుడు పడడం లేదు. అలాగే మరో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య కూడా విశాఖలో సీటు ఆశిస్తున్నారు. టీడీపీతో పొత్తులో ఆయనకు సీటు దక్కే అవకాశాలు లేకపోవడంతో కొన్నాళ్లుగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవలే జనసేనలో చేరిన కొణతాల రామకృష్ణ అనకాపల్లి అసెంబ్లీ నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం అక్కడ చాలా ఏళ్లుగా ఇన్‌చార్జిగా ఉన్న పరచూరి భాస్కరరావుకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. టీడీపీతో పొత్తు వల్ల తమకు పోటీ చేసే అవకాశమే లేకుండా పోతోందన్న ఆవేదన ఒకవైపు, తాము కష్టపడి పార్టీ కోసం పనిచేస్తే ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పెద్ద పీట వేస్తున్నారన్న బాధ మరో వైపు జనసేన నాయకులను వేధిస్తోంది.

ఏళ్ల కల.. నెరవేరిన వేళ

ప్రభుత్వానికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన గిరిజనులు, సీపీఎం నాయకులు



కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న గిరిజనులు

కోటవురట్ల: మండలంలోని గొట్టివాడ శివారు అణుకు గ్రామస్తుల ఎన్నో ఏళ్లనాటి రహదారి కల నెరవేరింది. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి రోడ్డు లేక గిరిజనులు ఎన్నో ఏళ్లగా ఇబ్బందులు పడుతున్నారు. చాలా సార్లు ఆందోళన చేశారు. గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కలెక్టర్ రవి పట్టాన్ దృష్టికి ఈ సమస్య వెళ్లడంతో ఆయన స్పందించారు. అణుకు గిరిజన గ్రామానికి రూ.38 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో గిరిజనులకు ఇళ్లు, తాగునీటి సరఫరా తదితర సదుపాయాలు కల్పిస్తూ నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, గ్రామ గిరిజనులు ప్రభుత్వానికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అప్పలరాజు మాట్లాడుతూ గిరిజన గ్రామానికి గ్రావెల్ రోడ్డు వేయడమే కాకుండా 17మంది గిరిజనులకు జగనన్న కాలనీ మంజూరు చేశారన్నారు. ప్రతి ఇంటికీ మంచినీటిని అందించేందుకు నిధులు కేటాయించారన్నారు. గతప్రభుత్వంలో పరిష్కారం కాని సమస్య ఈ ప్రభుత్వ హయాంలో తీరినందుకు ఆనందంగా ఉందన్నారు. గిరిజనులకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, తారు రోడ్డు వేయాలని కోరారు. సీపీఎం నాయకులు గజ్జెలపు డేవిడ్‌రాజ్, త్రినాథ్, వరహాలు, సూరిబాబు, అర్జున తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎంపీపీ రాజారామ్ బాధ్యతల స్వీకరణ



రాజారామ్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం



ఎంపీపీ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న రాజారామ్

మాడుగుల: స్థానిక ఇన్‌చార్జి ఎంపీపీగా తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ముందుగా స్వగ్రామం జేడీపేట నుంచి భారీ ర్యాలీగా ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు చేరుకుని మోద కొండమ్మ పాదాలను దర్శించుకుని, అక్కడ నుంచి మాడుగుల మోద కొండమ్మ ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా తీన్‌మార్ వాయిద్యాలు, మహిళల కోలాటాలు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆశీస్సులు తీసుకుని ఉదయం 11గంటల సమయంలో ఎంపీపీ కుర్చీలో కూర్చున్నారు. ఎంపీడీవో కాశీప్రసాద్ అందజేసిన ఫైల్‌లో జెడ్పీసీఈవో ఎం.పోలినాయుడు సమక్షంలో సంతకం చేశారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో నిర్వహిస్తానని చెప్పారు. అనంతరం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతో పాటు నాయకులు, అభిమానులు దుశ్శాలువాలతో రాజారామ్‌ను సత్కరించారు. జెడ్పీటీసీలు కిముడు రమణమ్మ, కర్రి సత్యం, మాజీ ఎంపీపీ రామధర్మజ, ఏఎంసీ చైర్మన్ కొండలరావు, వైస్‌ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్‌లు ఎడ్ల కళావతి, గొల్లవిల్లి సంజీవరావు, కొసిరెడ్డి కృష్ణమూర్తి, గురువునాయుడు, జామి రమణబాబు, కోట్ని జయమ్మ, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, తలారి అప్పారావు, కుక్కర మహేశ్వరి, వైఎస్సార్‌సీపీ దేవరాపల్లి మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులపై నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు

- పాఠశాలల్లో డీఈవో ఆకస్మిక తనిఖీలు
- ఇద్దరు ఎంఈవోలు, హెచ్‌ఎం, ముగ్గురు టీచర్లకు షోకాజ్ నోటీసులు



యలమంచిలి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థిని సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈవో

యలమంచిలి రూరల్/కశింకోట: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న టెన్త్ ప్రత్యేక తరగతులను సక్రమంగా నిర్వహించని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడడం లేదు. ఆదివారం జిల్లాలో యలమంచిలి పట్టణం, కశింకోట మండలాల్లో పలుఉన్నత పాఠశాలలను డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కశింకోట డీపీఎన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు రెమెడీయల్ క్లాసులు నిర్వహించకపోవడంపై పాఠశాల హెచ్‌ఎం, కశింకోట ఎంఈవోలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కశింకోట బాలికలు, కొత్తపల్లి బుచ్చెయ్యపేట, యలమంచిలి పట్టణంలోని బాలికలు, కొత్తపేట, రైల్వేస్టేషన్‌రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, తేగాడ కేజీబీవీ విద్యాలయాలను పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. యలమంచిలి కొత్తపేట ఉన్నత పాఠశాలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు స్టడీ క్లాసులు నిర్వహించి, వెళ్లిపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన డీఈవో, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్టడీ క్లాసుల్లో విద్యార్థులను ఉంచాలని సంబంధిత సోషల్ టీచర్‌కు సూచించారు. తనిఖీల్లో భాగంగా ఆమె పలుచోట్ల విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. అన్ని పాఠశాలల్లో 50 రోజుల ప్రత్యేక ప్రణాళిక పక్కాగా అమలయ్యేలా ఎంఈవోలు పర్యవేక్షించాలని డీఈవో ఆదేశించారు.కశింకోట మండలం తేగాడ కస్తూర్బాగాంధీ విద్యాలయంలో పంచతంత్రం పేరుతో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా అమలు చేస్తున్న యాక్షన్ ప్లాన్ పట్ల డీఈవో సంతప్తి చెందారు.

ఆరుగురికి షోకాజ్ నోటీసులు

పదోతరగతి ప్రత్యేక తరగతులను నిర్వహించని కశింకోట డీపీఎన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెంది న ముగ్గురు సోషల్‌స్టడీస్ బోధిస్తున్న ఉపాధ్యాయులు ఎ.వరలక్ష్మి,వి.సూర్యప్రభ, వి.శేషుకుమార్, అదే పాఠశాలహెచ్‌ఎం ఎం.ఆర్.వి.అప్పారావు, పర్యవేక్షణ సక్రమంగా చేయని కశింకోట ఎంఈవోలు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.చిట్టిబాబులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు డీఈవో తెలిపారు. అన్ని స్కూళ్లలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు, ఎంఈవోలు కృషి చేయాలని సూచించారు.ఎక్కడైనా నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు రూపొందించిన ప్రత్యేక స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందజేయాలని తెలిపారు.

క్లుప్తంగా

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి


సందర్శకుల జలకాలాటలు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో కోలాహలం నెలకొంది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి ప్రవేశించే నీటిలో జలకాటాలాడేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు పోటీపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వాహనాల్లో రావడంతో ఈ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. అదేవిధంగా తాండవ రిజర్వాయరు పైనా సందర్శకులు తాకిడి కనిపించింది. కొంతకాలంగా ఈ రెండు ప్రదేశాలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి అధికంగా సందర్శకులు రావడంతో కొత్తగా చిరువ్యాపారులు షాపులు ఏర్పాటు చేస్తున్నారు.

ఏయూలో వెబ్ సిరీస్ షూటింగ్



మద్దిలపాలెం: నటుడు ఆది పినిశెట్టి హీరోగా తెరకెక్కుతున్న ఓ వెబ్‌సిరీస్ షూటింగ్ ఆదివారం ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజినీర్ కళాశాలలో జరిగింది. ఇక్కడ కాలేజీ ఎన్నికలు, ప్రచారం తదితర సన్నివేశాలను చిత్రీకరించారు. సినీప్రియులు షూటింగ్ తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

హై కోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అమరావతి
S.A. No. 888/2000
సిరిశోళ్ళ అప్పికొండ వురప్పు తాత (లేటు) మరియు - అప్పెలెంట్లు
తాళవు రెడ్డి సింహాచలం వగైరాలు - రెస్పాండెంట్లు
To,
proposed Parties - 2, 4, 7 మరియు 11
2. తాళవురెడ్డి రమణ S/o. సింహాచలం, లక్ష్మీపురం విలేజ్, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్.
4. చేకూరి ఎరుకలమ్మ, W/o. సూర్యనారాయణ, వ్యవసాయం, కావగుంట, రావికమతం మండలం, అనకాపల్లి జిల్లా.
7. గంగిరెడ్డి అప్పియ్యమ్మ, W/o. పోతురాజు, వ్యవసాయం, జూహార్బి దగ్గర, విశాఖపట్నం, విశాఖపట్నం జిల్లా.
11. వనపర్తి బృందావన రావు S/o. మాధవరావు, రిటైర్డ్ టీచర్, విశాఖపట్నం, విశాఖపట్నం జిల్లా
ఈ పై నెంబరు పెటిండ అప్పీలులో మీకు నోటీసులు అందనందున, హైకోర్టువారు 25-01-2024న మీకు నోటీసులు సాక్షిపేపరులో Publish చేయమని కోర్టు ఆర్డరు వేసినారు. మీరు ఈ కోర్టు నోటీసు అందుకుని 28-02-2024లోపున కోర్టుకు హాజరు అయి మీ తరపున వాదనలు వినిపించుకోవలెను. లేనిచో మీ పైన Exparte ఆర్డర్లు పాస్ చేస్తారుఅని మీకు తెలియచేయడమైనది.
కందర్ప సుబ్రమణ్యం, అడ్వకేటు
403, క్రిస్టల్ కేసల్ అపార్ట్‌మెంటు, హాయ్ ల్యాండ్ రోడ్డు, చిన కాకాని, గుంటూరు జిల్లా. ఫోన్ : 93911 85608

ప్రభుత్వ పాఠశాలలకు ‘పీఎంశ్రీ’తో పరిపుష్టి

చోడవరం రూరల్ : రాష్ట్రంలో వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు అనూహ్యంగా మార్పు చెందిన సంగతి ప్రజలకు ఎరుకే. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చి, విద్యావిధానంలో సైతం సమూల మార్పులను తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మన బడులను తీర్చిదిద్దడం కేంద్రాన్ని సైతం కదిలించిందని చెప్పవచ్చు. దీంట్లో భాగంగానే దేశవ్యాప్తంగా పలు పాఠశాలల అభివృద్ధికి పీఎంశ్రీ అనే పథకాన్ని రూపొందించారు. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, సైన్సు లేబరేటరీలు, లైబ్రరీలు ఏర్పాటు, ఫిజికల్ ఫిట్‌నెస్‌ను పెంపు చేయడానికి పాఠశాలల మైదానాలను మెరుగుపరచడం, ఔట్‌డోర్, ఇండోర్ స్టేడియంలను నిర్మించడం వంటి అదనపు సదుపాయాలను కల్పించనున్నారు. భవిష్యత్‌లో పీఎంశ్రీ పథకంలో ఎంపిక కాబడిన ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అభివృద్ధి పరచనున్నారు.

జిల్లాకు రూ.3.56 కోట్లు పీఎంశ్రీ నిధులు

రాష్ట్రంలో 597 ఉన్నత పాఠశాలలు పీఎంశ్రీ పథకంలో ఎంపికవగా వీటిలో వివిధ ప్రయోగశాలల ఏర్పాటు కోసం రూ.65.22 కోట్లు మంజూరు చేసింది. అనకాపల్లి జిల్లాలో 24 మండలాల్లో 24 ఉన్నత పాఠశాలల్లో 94 పనుల నిమిత్తం రూ.3.56 కోట్లు నిధులు వెచ్చించనున్నారు. ఇదే పథకంలో రాష్ట్రంలోని ఎంపిక కాబడిన 662 పాఠశాలల్లో పీఎంశ్రీ పథకంలో భాగంగా మైదానాలను అభివృద్ధి పరచనున్నారు. ఇప్పటి వరకు ఆటస్థలాలు కలిగి ఉన్న 634 పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలు చొప్పున రూ.3.31 కోట్లు మంజూరు చేస్తారు. ప్రస్తుతం ప్రతి పాఠశాలకు మైదానం అభివృద్ధి నిమిత్తం లక్ష రూపాయల లెక్కన విడుదల చేశారు. ఈ పనులు సాగుతున్నాయి. ఫిజిక్సు, కెమిస్ట్రీ, బయాలజీ, సైన్సు లేబొరేటరీ పరికరాల నిమిత్తం రూ.లక్ష రూపాయలు లెక్కన, కెమిస్ట్రీ లేబొరేటరీ భవన నిర్మాణం కోసం రూ.15.58 లక్షలు విడుదల కానున్నాయి.


మెరుగుపడిన మైదానం

పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలు ఇవే..

అనకాపల్లి జిల్లాలో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ)లో భాగంగా 24 పాఠశాలలను ఎంపిక చేశారు. 24 ఫిజిక్స్, 18 కెమిస్ట్రీ, 15 బయాలజీ, 19 సైన్సు లేబరేటరీ పరికరాల ఏర్పాటుకు ఒక్కో లక్ష రూపాయలు 18 కెమిస్ట్రీ లేబరేటరీ భవనాల నిర్మాణానికి రూ.2.80 కోట్లు మంజూరు చేయనున్నారు. సర్వశిక్ష అభియాన్ పథకంలో చేపట్టబడే ఈ పనులను జిల్లాలోని 24 పాఠశాలలను ఎంపిక చేశారు. ఏపీ బాలికల రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాల, కోనాంలోని ఏపీ సోషల్ వెల్ఫేర్ ఉన్నత పాఠశాల, దేవరాపల్లి, కోటఉరట్ల, పాయకరావుపేట, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలు, వేములపూడి పిబిఎం జెడ్పీ ఉన్నత పాఠశాల, అలమండ కోడూరు, చీడిగుమ్మల, చినపాచిల, దేవరాపల్లి, డి.ఎర్రవరం, ఏటికొప్పాక, గణపర్తి, గిడుతూరు, కశింకోట, పరవాడ, కింతలి, లక్ష్మీపురం, రాంబిల్లి, రోలుగుంట, సీతయ్యపేట, తుమ్మపాల, వంపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలు పిఎంశ్రీకి ఎంపిక అయ్యాయి. భవిష్యత్‌లు ఈ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యార్జన చేయనున్నారు.



పాఠశాలలో పీఎంశ్రీ పథకం లోగో ఏర్పాటు

పాఠశాల అభివృద్ధికి ఉపయోగం



రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడులో భాగంగా మా పాఠశాలను మంచిగా అభివృద్ధి చేసుకున్నాం. వేన్నీళ్ళకు చన్నీళ్ళ తోడులాగా మా పాఠశాలను ప్రభుత్వం పిఎంశ్రీ పథకానికి ఎంపిక చేయడం మాకు ఎంతగానో సంతోషాన్ని కలిగించింది. లేబరేటరీల ఏర్పాటు రెండు లక్షలు మంజూరు కాగా, మైదానం అభివృద్ధికి ముందుగా లక్ష రూపాయలు విడుదల చేసారు. దీంతో ఎగుడు దిగుడుగా ఉన్న మైదానాన్ని మెరుగు పరుస్తున్నాం. ఇది మాపాఠశాలకు, పిల్లలకు, అదృష్టమే. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మా గ్రామం రుణపడి ఉంటుంది.

–భూతనాథు రామారావు, స్కూల్ కమిటీ చైర్మన్, లక్ష్మీపురం హైస్కూలు.

విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటు



ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో మా పాఠశాల ఎంపిక కావడం విద్యార్థులు మరింత ఉన్నతంగా విద్యాభ్యాసన చేయగలుగుతారు. లేబరేటరీల ఏర్పాటు వారి ఉన్నతి ఎంతగానో దోహదపడుతుంది. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి విద్యరంగం మెరుగునకు చేస్తున్న కృషి సర్వదా అభినందనీయం. సర్వశిక్షా అభయాన్ ద్వారా ఈ అభివృద్ధి పనులు నాడు–నేడు పథకం మాదిరిగానే చేపట్టబడతాయి. మా పాఠశాలకు ఫిజిక్సు, కెమిస్ట్రీ, లేబరేటరీ పరికరాలకు నిధులు మంజూరయ్యాయి. అలాగే గ్రౌండ్ డవలప్‌మెంట్‌కు నిధులు విడుదల అయ్యాయి,

–ఎ.వి.జగన్నాథరావు, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూలు, లక్ష్మీపురం

రసవత్తరంగా సెపక్ తక్రా జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక


దేవరాపల్లిలో సెపక్ తక్రా జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ నాగేంద్ర

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెపక్ తక్రా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఆదివారం రసవత్తరంగా జరిగింది. విశాఖపట్నం సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి జట్ల ఎంపిక ప్రక్రియలో 60 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఈ క్రీడాకారుల ఎంపికలో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలను స్థానిక ఎస్‌ఐ డి.నాగేంద్ర రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా బాల,బాలికలకు జూనియర్, సబ్ జూనియర్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ కార్యదర్శి కె. విజయ్‌కుమార్, పీడీ జి. నూకరాజు చేశారు. ఎంపిక చేసిన జట్లు ఈ నెల 24, 25 తేదీలలో నెల్లూరు జిల్లాలో జరిగే అంతర జిల్లాల సెపక్ తక్రా చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ క్రీడలో జట్టుకు ఐదుగురు చొప్పున ఎంపిక చేస్తామన్నారు.

టీడీపీ, జనసేన పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికలు

మాడుగుల రూరల్: మండలంలోని ముకుందపురం గ్రామానికి చెందిన నాలుగు కుటుంబాల వారు ఆదివారం మాడుగులలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీకి చెందిన కర్రి తమ్మునాయుడు, బాలిబోయిన అప్పారావు, కర్రి లక్ష్మి, జనసేన పార్టీకి చెందిన ఇల్లపు గంగరాజులతోపాటు వారి కుటుంబాలకు పార్టీ కండువాలు కప్పి డిప్యూటీ సీఎం సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పార్టీలో చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కార్యక్రమములో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, ముకుందపురం, వంటర్లపాలెం సర్పంచ్‌లు కర్రి గణేశ్, అల్లాడ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

మల్కాపురం: జాలరవీధికి చెందిన మోదు నవీన్(23)కి కొంతకాలంగా మానసిక పరిస్థితి బాగోలేదు. అతనికి కుటుంబ సభ్యులు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స ఇప్పిస్తున్నారు. ఆదివారం ఉదయం తన ఇంటి నుంచి బయటకు వచ్చిన నవీన్..మహాలక్ష్మి థియేటర్ ఎదురుగా ఐవోసీకి వెళ్లే మార్గంలోని 80 అడుగుల ఎత్తు గల విద్యుత్ హెవీ లైన్ స్తంభం ఎక్కాడు. కొద్దిసేపటికి నవీన్ విద్యుత్ షాక్‌కు గురై విలవిలలాడడంతో స్థానికులు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు విద్యుత్ సరఫరాను నిలిపివేసి నవీన్‌ను కిందకు దించారు. అప్పటికే మృతి చెందడంతో మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సీతారాములకు ఘనంగా పుష్పయాగం

1500 కిలోల వివిధ రకాలైన పూలను వినియోగించిన భక్తులు


పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు, భక్తులు


పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

కె.కోటపాడు : ఆర్.వై.అగ్రహారం గ్రామంలో శ్రీ సీతారాములకు 1500 కిలోల వివిధ రకాలైన పుష్పాలతో పుష్పయాగం కనుల పండువలా జరిపారు. గ్రామానికి చెందిన గోవిందు రమణమూర్తి, నేమాని వేంకటేశ్వరశర్మలతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పుష్పయాగం నిర్వహించారు. పెందుర్తి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు మహర్తి రామానుజం ఆధ్వర్యంలో వేదపండితులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి వేదపండితులు పుష్పయాగం ఘనంగా జరిపారు. కడియం నుంచి 1500 కిలోల బంతి, చామంతి, మల్లె, గులాబీలతో పాటు పలు రకాలైన పుష్పాలను తీసుకువచ్చి వినియోగించారు. కార్యక్రమంలో పాల్గొనడానికి ఆర్.వై.అగ్రహారంతో పాటు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సీతారాముల కల్యాణంతో ప్రారంభమైన కార్యక్రమం పుష్పయాగం, మహా మంగళ హారతితో ముగిసింది. అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ అనంతరం రాష్ట్రంలో మొదటిసారిగా ఆర్.వై.అగ్రహారం గ్రామంలోనే సీతారాములకు పుష్పయాగం నిర్వహించినట్టు గోవిందు రమణమూర్తి, నేమాని వేంకటేశ్వరశర్మ తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిపారు. మండ రమణమూర్తి, మండ మల్లికార్జున్‌తో పాటు గ్రామస్తులు సహకారం అందించారు.

బైక్‌తో చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

కోటవురట్ల : ప్రమాదవశాత్తూ చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. నీలిగుంట గ్రామానికి చెందిన కరెడ్ల లోవరాజు(41) ద్విచక్ర వాహనంపై వెళుతూ రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నీలిగుంట గ్రామానికి చెందిన లోవరాజు కొబ్బరికాయలు తీయించి నర్సీపట్నంలో దుకాణాలకు వేస్తుంటాడు. లోవరాజుకు ఇద్దరు పిల్లలు కాగా కుమార్తె కోటవురట్లలోని కేజీబీవీలో చదువుతోంది. ప్రతి ఆదివారం కుమార్తెను చూడడానికి తల్లిదండ్రులు ఇద్దరూ వెళ్లి వస్తుంటారు. లోవరాజు ఏదో పనిలో ఉండడంతో భార్య లక్ష్మి కేజీబీవీకి వెళ్లి కూతురుని చూసి తిరిగి వచ్చేందుకు తనను తీసుకెళ్లేందుకు రమ్మని భర్త లోవరాజుకు ఫోన్ చేసింది. భార్యను తీసుకొచ్చేందుకు లోవరాజు నీలిగుంట నుంచి బైక్‌పై కోటవురట్ల వెళుతూ రామచంద్రపాలెం సమీపంలోని గ్యాస్ పైప్ లైన్ దగ్గరలో చెట్టును ఢీకొట్టి పల్లంలోకి బైక్‌తో సహా పడిపోయాడు. ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భార్య లక్ష్మి, బంధువులు వెళ్లే సరికి మృతి చెంది ఉన్నాడు. భర్త మృతితో లక్ష్మి రోధన అందరినీ కలిచివేసింది. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.


ప్రమాద స్థలంలో లోవరాజు మృతదేహం

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ GVMC వార్డు పరిధిలో స్టీల్‌ప్లాంట్‌కి 7km, లే అవుట్‌లో 111 గజాలు ఇంటి స్థలం 9 లక్షలు దగ్గరలో అన్ని సౌకర్యాలు EMI కలదు. ఫోన్ : 81217 60605 [V-796981]

■ VUDA 350 (N) Sq.yds SVLND (Phase-1) Simhapuri Colony, VUDA 267 N/W CMR Layout, Kapuluppada MNR - 93931 20181, 76758 73076 [V-11867]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11574]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్ కలదు. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9030675274. [M-1233790]

■ మార్చి మొదటి వారంలో అమెరికా వెళుతున్న మాకు ఇంటి, వంట పనులు చేయుటకు ఆడమనిషి కావలెను. అమెరికా విజిటింగ్ వీసా కలిగిన వారు మాత్రమే సంప్రదించగలరు. ✆ 92904 15199 [B-790486]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ సూపర్ వైజర్లు, HR, సెక్యూరిటీగార్డులు పార్శిల్ ఆఫీస్ డెలివరీ బాయ్స్, పెట్రోల్ బంక్ బాయ్స్, హౌస్ కీపింగ్ కావలెను. వాట్సప్ నెం : 77029 59468, సెల్ : 87904 11889 [V- 1399]

■ Free Training Software Courses AI & BIG Data Analytics 22, 23 Pass, Any Degree @ Gajuwaka. Ph : 95733 66611, 99596 17457 [V-5447]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ మేసేజ్‌లు పంపుతూ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95027 12418, 90306 12463 [M-1233787]

■ Wanted PRO's / Marketing Executives, LAB Technicians & Collection Boys for Our Medical Diagnostic Laboratory. ✆ 96669 50799 [B-788081]

■ 18-50 సం॥ మహిళలు/పురుషులు మా కంపెనీ కొరకు అర్జెంట్‌గా కావలెను. డైరెక్ట్ జాబ్ (ఏజెంట్లకు 5000/- కమీషన్) ఫ్రీ రూం+భోజనం+ జీతం : 25000/-. Ph: 8886733008 [HA-10851]

■ హైదరాబాద్ ఇంటి/వంటపని, పిల్లలను & ఇంట్లో ఉండి పెద్దవారిని చూసుకొనుటకు 45 సం॥ లోపు ఆడ పనివాళ్ళు కావలెను. జీతం: 15000/- భోజన వసతి కల్పించబడును. ఫోన్:9059263326. [HA-13984]

■ ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయుటకు లోడింగ్ సూ"పైజర్స్, హౌస్ కీపింగ్ సూ"పైజర్స్, డ్రైవర్స్, కార్గో లోడర్స్,కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీతం: 25000/- 35000/- రూం+భోజనం ఫ్రీ. ఫోన్: 7093789794. [H-788067]

■ మెడ్‌ప్లస్ ఫార్మసీ విశాఖపట్నం లోని మెడికల్ షాప్‌లో పని చేయుటకు ఫార్మాసిస్ట్ (PCI కలిగినా) D/B/M ఫార్మసీ మరియు మెడికల్ షాప్‌లో అనుభవం కలవారు కావలెను. PH: 8499800111, 8498062388. [HA-796]

■ JOB Openings in Top Overseas Education Company. Need Hardworking and Sincere FEMALES only. Seeking Candidates who can Work Long Term, Salary Depends on Profile (15 k to 25 k & Incentives) (Designation: Student Counselor) training will be provided. Job Location : Mg Road, Vijayawada, Call: 7799833336. [HA-50144]

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిం దిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి
మురళీనగర్, మాధవధార : 90101 33346
NAD, కంచరపాలెం : 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి : 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్ : 90100 55116
దాబాగార్డెన్స్, జగదాంబ / MVP కోలనీ, మద్దిలపాలెం : 90101 96663
రాజువాక : 97059 33394
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

పశువుల పాక దగ్ధం

రెండు పాడి గేదెలకు తీవ్ర గాయాలు


ప్రమాదంలో కాలిపోయిన పాక

రావికమతం: మండలంలోని కిత్తంపేటలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కింతాడ సత్తిబాబు పశువుల పాక, గడ్డివాము దగ్ధమయ్యాయి. పాకలో కట్టి ఉంచిన పాడిగేదె తీవ్రంగా కాలిపోగా, మరొకటి కాలిన గాయాలతో పారిపోయింది. రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. తనపై గిట్టనివారే ఈ పని చేసి ఉంటారని అనుమానంతో కొత్తకోట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.


తీవ్రంగా గాయపడిన పాడి గేదె

నాయకుల వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటు

ఆత్మీయ సమావేశంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

తుమ్మపాల: రాష్ట్రాన్ని బాగు చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మరో రెండు నెలలు అందరం కలిసికట్టుగా పనిచేయాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. పట్టణంలో రోటరీ క్లబ్‌లో మెగా అభిమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి రాజకీయ నాయకులే కారణమని, ఇక్కడి ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని వేలకోట్లు దోచుకున్నారని చెప్పారు. మన ప్రాంతాన్ని మనమే బాగు చేసుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి ముందుకు రావాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కొణిదెల నాగబాబు

యూసీసీ టీ-20 విజేత గెలాక్సీ

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ–20లో గెలాక్సీ జట్టు విజేతగా, కావలీర్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. రైల్వే స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన డిఫెండింగ్ చాంపియన్ కావలీర్స్ జట్టు లక్ష్య ఛేదనకే మొగ్గుచూపడంతో గెలాక్సీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసింది. సందీప్ 43, పి.అవినాష్ 33 పరుగులు చేశారు. విపిన్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా కావలీర్స్ 18.5 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌటైంది. పృథ్వీ 28 పరుగులు చేశాడు. అవినాష్ బౌలింగ్‌లోనూ రాణించి మూడు వికెట్లు తీయడంతో పాటు ఫైనల్ బెస్ట్‌గా నిలిచాడు.

బర్డ్ ఫ్లూపై హై అలర్ట్!

- ‘నెల్లూరు’ ఘటనతో అప్రమత్తం
- ఇతర జిల్లాల నుంచి కోళ్ల రవాణా నిలిపివేత
- పౌల్ట్రీ రైతులకు పశు సంవర్ధక శాఖ అవగాహన
- పరిస్థితిని సమీక్షించేందుకు ప్రత్యేక వెటర్నరీ బృందాలు
- కోళ్ల ఫారాల్లోకి వాహనాలు, ఇతరుల ప్రవేశం నిషేధం

సాక్షి, విశాఖపట్నం: బర్డ్ ఫ్లూ అలజడిపై పశు సంవర్ధక శాఖ అప్రమత్తమైంది. నెల్లూరు జిల్లాలో ఇటీవల పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడడం, అది బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ కావడంతో ప్రభుత్వం యంత్రాంగాన్ని అలెర్ట్ చేసింది. ఈ వ్యాధి సోకిన కోళ్లు చనిపోవడమే కాదు.. వాటిని తిన్న మనుషులకు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. దీంతో ఈ వ్యాధి ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని పశు సంవర్ధక శాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. బర్డ్ ఫ్లూపై తీసుకోవలసిన జాగ్రత్తలపై పౌల్ట్రీ రైతులు, కోళ్ల ఫారాల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు. కోళ్ల ఫారాల్లోకి కొత్త వారిని అనుమతించవద్దని, ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బందినే కొనసాగించాలని, వీరిని ఇతర ప్రాంతాలకు పంపించవద్దని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ఫారాల్లోకి ప్రవేశాన్ని నిషేధించాలని సూచిస్తున్నారు. ఒకవేళ వాహనాలను పంపించాల్సి వస్తే విధిగా సోడియం క్లోరైడ్‌ను చల్లాలని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి కోళ్ల రవాణాను కొన్నాళ్లపాటు నిలిపివేయాలని పౌల్ట్రీ రైతులు, వర్తకులను ఆదేశించారు. అలాగే వలస పక్షుల వల్ల కూడా బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందే అవకాశం ఉండడంతో అలాంటి ప్రాంతాలపై దృష్టి సారిస్తున్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవలో వలస పక్షుల రాకపోకలుంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని అక్కడ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అనకాపల్లి జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి బి.ప్రసాదరావు ‘సాక్షి’తో చెప్పారు. ఆర్బీకేల పరిధిలో తమ సిబ్బంది బర్డ్ ఫ్లూపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కాగా ఉమ్మడి విశాఖ జిల్లాలో బ్రాయిలర్, లేయర్ (గుడ్లు పెట్టేవి) కోళ్లు దాదాపు 37 లక్షల పెరుగుతున్నాయి. వీటిని సుమారు 130 ఫారాల్లో పెంచుతున్నారు. ఇవి కాకుండా మరో మూడు లక్షల దేశీ (నాటు) కోళ్లున్నాయి.


ఫారాల్లో పెరుగుతున్న కోళ్లు

పశు సంవర్ధక శాఖ ప్రత్యేక టీమ్‌లు

బర్డ్ ఫ్లూపై పర్యవేక్షణకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఆ శాఖ గ్రామ సహాయకులు ఉన్నారు. ఇలా విశాఖ జిల్లాలో 17, అనకాపల్లి జిల్లాలో 48 టీమ్‌లను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

బర్డ్ ఫ్లూపై ఆందోళన వద్దు

బర్డ్ ఫ్లూపై ఆందోళన చెందాల్సిన పని లేదని, ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడా ఆ ఛాయలు లేవని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) విశాఖపట్నం జోనల్ చైర్మన్ టి.ఉదయ భాస్కర్ ‘సాక్షి’కి చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు బర్డ్ ఫ్లూ సోకకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, కోళ్లకు ముందస్తుగా వ్యాక్సినేషన్లు వేయిస్తున్నామని, వైరస్ వ్యాప్తి చెందకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ఫారాల్లోకి అనుమతించడం లేదని తెలిపారు.

నేటి నుంచి శ్రీలలితాపీఠం 75వ వార్షికోత్సవం

సీతంపేట: శ్రీ లలితాపీఠం 75వ వార్షికోత్సవం సందర్భంగా ‘అమృతోత్సవం’పేరిట ఈ నెల 19 నుంచి 24 వరకు పాంచరాత్ర దీక్షతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అక్కయ్యపాలెం శ్రీ లలితా పీఠంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ తేదీ సోమవారం ఉదయం 5 గంటల నుంచి మహా సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన, అంకురార్పణ, రుత్విగ్వరణం, అగ్నిమథనం, అఖండ దీపస్థాపన, సాయంత్రం 7 గంటలకు లలితావైభవం కవి సమ్మేళనం, పీఠాధిపతిచే అనుగ్రహ భాషణం జరుగుతుందన్నారు. 20వ తేదీ ఉదయం 9 గంటలకు యాగశాలలో మండపారాధన, కలశస్థాపన, సాయంత్రం లలితాసహస్రనామ పారాయణ, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామి అనుగ్రహ భాషణం చేస్తారన్నారు. 21వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు శ్రీభూనీలా సమేత కల్యాణ వెంకటేశ్వరుని కల్యాణం, 22వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు లలితాకామేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని వెల్లడించారు. 23 తేదీ సాయంత్రం జగద్గురువులచే అమృత భాషణం, 24వ తేదీ ఉదయం విశేష హోమాలు, సాయంత్రం 6 గంటలకు లలితా అమ్మవారి నగరోత్సవం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

20న వక్తృత్వ పోటీలు

అనకాపల్లి : తెలుగు భాష పరిరక్షణ సమితి, రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20 మధ్యాహ్నం 3 గంటలకు విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక రింగ్‌రోడ్డు హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆవరణలో మాతృభాష దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుగు భాష పరిరక్షణ సమితి ప్రతినిధి రామ్‌మోహన్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ విభాగం (ఇంటర్ ఆపైన) తెలుగు భాష గొప్పదనం పరిరక్షణ, జూనియర్ విభాగం (8,9,10 తరగతులు) వేమన చరిత్ర, సబ్ జూనియర్ విభాగంలో (6, 7 తరగతులు) సుమతీ శతకంలోని 2 పద్యాలు, వివరణ, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. గరిష్ట పరిమితి 5 నిమిషాలు మాత్రమే అని, తెలుగు తప్ప ఇతర భాషా పదాలు దొర్లకుండా మాట్లాడాలన్నారు. పాటల పోటీకి ఏదైనా చక్కని తెలుగుపాట పాడాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 21 ఉదయం 10 గంటలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజుపాలెం సూర్యనారాయణమూర్తి

అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణమూర్తిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా మొదటి ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తుల స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ కర్రి కోటేశ్వరరరావు, కార్యదర్శి గొల్లవిల్లి కోటేశ్వరరావు, కోశాధికారి గొల్లవిల్లి రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వర ఉత్సవాలు

గొలుగొండ: జోగుంపేటలో గౌరీపరమేశ్వర ఉత్సవాలు ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ విద్యుత్ అలంకరణ తదితర ఏర్పాట్లు చేశారు. భక్తులు గౌరీపరమేశ్వరులపే దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి తీర్థ మహోత్సవాలు నిర్వహించగా, చుట్టుపక్కల గ్రామాలైన గొలుగొండ, జానకీరాంపురం, నర్సంగబిల్లి, సాలికమల్లవరం, జమ్మాదేవిపేట, వెంకటాపురం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
నాగద్వీపం (తెలుగు):	సత్యనారాయణస్క్రీన్-1
మేడెన్ వెబ్(రెండు షోలు):	సత్యనారాయణ స్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన:	పర్తిసాయి
ఓయ్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 95 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-32 యూనిట్లు, బీ పాజిటివ్-36 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 295 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 228 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

ఇది కదా అభివృద్ధి

అటు అందం.. ఇటు ఆధ్యాత్మికం

- ప్రజలకు అందుబాటులోకి శాంతి పార్కు
- శారదా నది.. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం చెంతనే ఉండటంతో పట్టణవాసుల హర్షం

పట్టణ ప్రజల ఆహ్లాదానికి అధికారులు పార్కులను ఆధునికీకరించారు. శారదా నది ఒడ్డునున్న శాంతి పార్కుకు నూతన హంగులు అది త్వరలో ప్రారంభించనున్నారు. పిల్లలు, పెద్దలకు అనువుగా ఉండే ఈ పార్కు అందుబాటులోకి వస్తే చాలా బాగుంటుందని అంతా చెబుతున్నారు. ఒకవైపు శారదా నది, మరోవైపు ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం ఉండడం వల్ల ఈ పార్కు ఆహ్లాదంతో పాటు ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతుందని పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పార్కులోకి మెట్ల దారి

అనకాపల్లి : స్థానిక శారదా నది ఒడ్డున శాంతి పార్కు త్వరలో పట్టణవాసులకు అందుబాటులోకి రానుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆహ్లాదానికి ఎటువంటి పార్కులు అందుబాటులో ఉండేవి కాదు. ఆదివారం తల్లిదండ్రులు చిన్నారులను పార్కులకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. కొన్ని సమయాల్లో పిల్లల్ని తీసుకుని విశాఖ పరుగులు తీసేవారు. ఇది అందరికీ సాధ్యమయ్యేది కాదు. ఆర్థికంగా ఇబ్బందులున్న వారు తమ పిల్లల్ని తీసుకెళ్లేందుకు వెనుకాడేవారు. నెలలో ఒక్క ఆదివారమైనా విశాఖ వెళ్లి తిరిగి రావాలంటే రూ.1000 వరకు ఖర్చు చేయాల్సి వచ్చేది. అన్నమయ్య పార్కు అందుబాటులో ఉన్నప్పటికీ శారదా బ్రిడ్జి నిర్మాణంతో పార్కు మొత్తం మాయమైంది. దీంతో గవరపాలెం పరమేశ్వరి పార్కు ఉన్నప్పటికీ గవరపాలెం వాసులు తప్ప మరే ఇతర ప్రాంతాల ప్రజలను రానివ్వకుండా చేయడంతో ఇటు అల్లరి, అటు ఆర్థిక ఇబ్బందులతో సామాన్యులు ఏం చేయాలో తెలియక అయోమయంలో ఉండిపోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడమే తడువు ప్రజా ప్రతినిధులు పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అనకాపల్లి–చోడవరం విజయరామరాజుపేట రహదారిలో వ్యాయామ శాలతో పాటు పార్కు ఏర్పాటు చేశారు. గాంధీనగరంలోని గాంధీ పార్కును ఆధునికీకరించారు. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన చిన్నారులు, మహిళలు సాయంత్రం వేళల్లో కాలక్షేపం చేస్తున్నారు. శారదా నది ఒడ్డున శిథిలావస్థలో ఉన్న పార్కుపై ఎంపీ బీవీ సత్యవతి దృష్టి సారించి ఆధునికీకరించేందుకు కృషి చేశారు. వెంటనే జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పార్కు ఆధునికీరించాలని కమిషనర్‌ను కోరారు. దీంతో జీవీఎంసీ రూ.49 లక్షలు కేటాయించడంతో పాటు ఎంపీ సత్యవతి తన నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. మొత్తం రూ.59 లక్షలతో జీవీఎంసీ అధికారులు పార్కును అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఈ పార్కును మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి ప్రారంభించనున్నారు. ఈ పార్కులో సిమెంట్ బెంచీలు, చిన్నారులకు ఊయలలు, జారుడు బల్ల వంటివి అందుబాటులోకి తేవడంతో పట్టణవాసులు ఈ పార్కు ఎప్పుడు ప్రారంభమవుతుందా అని ఎదురు చూస్తున్నారు.



పూలమొక్కలు సరి చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది



పార్కులో ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్న పూలమొక్కలు



పార్కులో జారుడుబల్ల



పార్కులో ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు



పార్కులో పూలమొక్కలు పెంచేందుకు కుండీలు

అందుబాటులో మూడు పార్కులు..



పట్టణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గాంధీనగరం, విజయరామరాజుపేటల్లో రెండు పార్కులను అభివృద్ధి చేసి ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు చిన్నారులకు అందుబాటులోకి తీసుకొచ్చాం. త్వరలో శాంతి పార్కు ప్రారంభమైతే మొత్తం మూడు పార్కులు అందుబాటులోకి వస్తాయి. ఈ పార్కు అత్యంత ప్రతిష్టాత్మకమైనది. పార్కు పక్కనే శారదా నది ఉండడం వల్ల చల్లటి గాలి వీస్తుంది. పార్కు నిండా పచ్చని మొక్కలుండడం వల్ల ఆహ్లాదకరణ వాతావరణం ఉంటుంది. – మందపాటి సునీత, 82వ వార్డు కార్పొరేటర్

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం..



శాంతి పార్కు అభివృద్ధికి నోచుకోవడం అదృష్టం. ఈ పార్కు ఎదురుగా శారదా నది, ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం ఉన్నాయి. దీంతో అందంతో పాటు ఆధ్యాత్మికంగాను బాగుంటుంది. పిల్లలు ఆడుకోవడానికి ఎంతో వీలుగా ఉంటుంది. ఎక్కడో వైజాగ్ వరకు ప్రయాశ పడి వెళ్లనవసరం లేదు. పెద్దలకు కూడా బాగుంటుంది. సాయంత్రం వేళల్లో పార్కులో ప్రశాంతంగా గడపొచ్చు. శాంతి పార్కును అందుబాటులోకి తీసుకొస్తున్న అధికారులకు ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను.

– కోన ఉమ, అనకాపల్లి

ఊహ నిజమైంది..



గతంలో శాంతి పార్కు శిథిలావస్థలో ఉండేది. ఈ కారణంగా ఇది మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రేమ జంటలు ఈ పార్కులో ఎక్కువగా కనిపించేవి. అప్పట్లో ఈ పార్కును అభివృద్ధి చేస్తే బాగుండును అని ఊహించుకునే వాడిని. ఇప్పుడు శాంతి పార్కు అభివృద్ధికి నోచుకుని ప్రారంభోత్సవానికి సిద్ధం కావడంతో ఎంతో ఆనందంగా ఉంది. ముఖ్యంగా పిల్లలు, పెద్దవాళ్లకు పార్కు చక్కటి సేవలందించగలదని చెప్పొచ్చు. పార్కును ఆధునికీకరించిన నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు.

– ఈతలపాక శివ, అనకాపల్లి

సరికొత్తగా కళ్యాణ మండపం





ఉగ్గినపాలెంలో నూతన హంగులతో నిర్మించిన గుడివాడ గురునాథరావు, సీతారాముల కళ్యాణ మండపం

- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉగ్గినపాలెం ప్రజలు
- 17 ఏళ్ల నిరీక్షణకు తెర పడనుందని హర్షం



కళ్యాణ మండపానికి అందంగా తయారు చేసి అమర్చిన ప్రవేశ ద్వారం

కశింకోట : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధారణ సమస్యలే కాకుండా దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కూడా శాశ్వత ప్రాతిపదికపై పరిష్కరించి ప్రజల మన్ననలు పొందుతోంది. ఇందుకు ఉగ్గినపాలెంలోని కళ్యాణ మండపం నిదర్శనంగా నిలుస్తోంది. సుమారు 17 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న కళ్యాణ మండపాన్ని అన్ని హంగులతో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఉగ్గినపాలెంలో వివాహాది శుభకార్యాలు నిర్వహించుకోవడానికి కళ్యాణ మండపం లేదు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 17 ఏళ్ల క్రితం సుమారు రూ.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన కళ్యాణ మండపం నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయింది. దాన్ని పూర్తి చేయడానికి ఆ తర్వాత ఎవరూ ముందుకు రాని పరిస్థితి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇళ్ల వద్ద, రోడ్లపైన కళ్యాణాలు, ఇతర కార్యాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు కళ్యాణ మండపం సమస్యను తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పరవాడ వద్ద ఉన్న అరబిందో ఫార్మా ఫౌండేషన్ యాజమాన్యం దృష్టికి ఈ విషయం మంత్రి తీసుకెళ్లడంతో కళ్యాణ మండపాన్ని పూర్తి చేయడానికి ముందుకు వచ్చారు. పరిశ్రమలు సేవా కార్యక్రమాలకు వినియోగించే సీఆర్‌ఎస్ నిధుల నుంచి దాదాపు అర కోటితో అన్ని హంగులతో అందంగా తీర్చిదిద్ది కళ్యాణ మండపాన్ని పూర్తి చేశారు. దీనిలో వివాహాలు జరిపించుకోవడానికి వేదికతో పాటు అన్న సమారాధనలకు హాలు నిర్మించారు. దీనికి గుడివాడ గురునాథరావు, సీతారాముల కళ్యాణ మండపం అని నామకరణం చేశారు. దీన్ని సోమవారం ప్రారంభించి వివాహాది శుభ కార్యాలకు అందివ్వడానికి సిద్ధం చేశారు. దీంతో స్థానికులు దీర్ఘకాలిక సమస్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పరిష్కారం అయినందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఉగ్గినపాలేనికి మరో మణిహారంగా నిలిచి అందరికీ ఉపయోగపడుదంటున్నారు.

ఇబ్బందులు తప్పతాయి..



ఉగ్గినపాలెంలో కళ్యాణ మండపం లేదు. దీంతో వివాహాది శుభ కార్యాలు జరిపించుకోవాలంటే తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ఇళ్ల వద్ద, వీధుల్లో రోడ్లపైన కళ్యాణాలు జరిపించుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు కళ్యాణ మండపం సిద్ధం చేయడంతో ఇబ్బంది తప్పనుంది. శాశ్వత ప్రాతిపదికన కళ్యాణ మండపాన్ని పూర్తి చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

– మటం నూకరాజు, ఉగ్గినపాలెం

అభినందనీయం..



ఉగ్గినపాలెంలో కళ్యాణ మండపం 17 ఏళ్లుగా అసంపూర్తిగా ఉంది. దాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రత్యేక శ్రద్ధ వహించి అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం.

–కలగా చిన్నబ్బాయి, ఉగ్గినపాలెం.

రేపటి నుంచి కన్యకాపరమేశ్వరి శత జయంతి వేడుకలు



కన్యకాపరమేశ్వరి శతజయంతి వేడుకల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కోరుకొండ బుచ్చిరాజు

అనకాపల్లి: శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్టా శత జయంతి ఉత్సవాలను ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు ప్రతిష్టా శత జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆలయాన్ని 1925 ఫిబ్రవరి 4న(భీష్మ ఏకాదశి రోజున) నిర్మించినట్టు చెప్పారు. ఈ మేరకు 100వ శతజయంతిని ఈ ఏడాది 20న భీష్మ ఏకాదశి రోజున నిర్వహించనున్నామన్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని 90 కేజీల వెండితో తయారు చేసిన అమ్మవారి రథాన్ని ఊరేగిస్తామన్నారు. 108 మంది మహిళలు 108 కలశాలతో శోభాయాత్ర చేపడతామన్నారు. 21న నిత్యార్చన, విశేష ఆరాధన నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ, 22న నిత్యార్చన, విశేష కుంకుమ పూజ, 1008 గాజులతో సహస్ర నామార్చన, 23న నగర సంకీర్తన, గోపూజ, అమ్మవారికి అభిషేకం, నవకలశ స్నపనము, హోమాలు, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలను కశింకోట ఆగమ పండిత్, అర్చక ఎగ్జామినర్ గవర్నమెంట్ ఆఫ్ రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం శతజయంతి వేడుకల కరపత్రాలు ఆవిష్కరించారు. ఉత్సవ కో–చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత



వినాయక ఆలయంలో హోమం చేస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: మానసిక ప్రశాంతత కోసం ప్రతి వ్యక్తి దైవభక్తిని పెంచుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో స్థానిక 82వ వార్డు నర్సింగరావుపేటలో నిర్మించిన వినాయక దుర్గ సాయినాథ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో ప్రతి వ్యక్తి వివిధ పనుల్లో నిమగ్నమై పలు రోగాల బారిన పడుతున్నారన్నారు. మానసిక ప్రశాంతత కోసం దైవ దర్శనాలు చేసుకోవాలని ఆయన సూచించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకుని బడుగు, బలహీన వర్గాలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత గోవిందరావుకు ఘన నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న వక్త

తుమ్మపాల : మాజీ ఎమ్మెల్యే, సీపీఐ నాయకుడు కామ్రేడ్ కోడిగంటి గోవిందరావు 10వ వర్ధంతి పట్టణంలో సీపీఐ పార్టీ కార్యాలయంలో జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, చెరుకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ డాక్టర్ చెలికాని కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భూహక్కుల యాజమాన్య చట్టం వల్ల సొంత భూమి కలిగిన ప్రతివ్యక్తి, రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంతకు ముందు సీపీఐ నాయకులు ర్యాలీగా బయలుదేరి నెహ్రూ చౌక్‌లో గల కోడిగంటి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావు జగ్గారావు, మేక సత్యనారాయణ, కోరుబిల్లి శంకరరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, వెలుగుల అర్జునరావు, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు 20న ధర్నా

తుమ్మపాల : ఈ నెల 20న ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్ ఆఫీసు వద్ద జరగనున్న ధర్నాలో జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పాల్గొనాలని జేఏసీ నాయకులు కోరారు. బకాయిలను వెంటనే చెల్లించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఓపీఎస్ అమలు చేయాలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ గొంది చినబ్బాయి అన్నారు.

ఫ్యాషన్ గార్మెంట్స్ మేకింగ్ కోర్సుకు ప్రవేశ పరీక్ష

అచ్యుతాపురం: ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఫ్యాషన్ గార్మెంట్స్, మేకింగ్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన ఎంట్రన్స్ టెస్టుకు 200 మందికి పైగా హాజరయ్యారు. బ్రాండిక్స్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కోర్సులో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్టు ఆదివారం నిర్వహించారు. ఈ కోర్సులో 30 సీట్లు ఉన్నాయని, సీట్లు లభించిన వారికి నెలవారీ స్టైఫండ్ ఇస్తామని కళాశాల ప్రిన్సిపాల్ నాయుడు తెలిపారు.

నేడు పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

అనకాపల్లి : నియోజకవర్గంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి సోమవారం ఉదయం 9 గంటలకు నుంచి నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శంకరం గ్రామంలో రూ.1.50 కోట్ల ఎంపీ నిధులతో సామాజిక సాంస్కృతిక భవన నిర్మాణానికి శంకుస్థాపన, వెంకుపాలెం, కశింకోట మండలంలో పరవాడపాలెం, ఉగ్గినిపాలెం, కశింకోట గ్రామాల్లో అరబిందో కంపెనీ సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన కళ్యాణ మండపాలు ప్రారంభోత్సవాలు, కశింకోట గ్రామంలో రూ.50 లక్షల నిధులతో నిర్మించే అంబేడ్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ ఈ కార్యక్రమాలకు హాజరు కానున్నట్టు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

దేవరాపల్లి: ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గ్రంథ పాలకుడు ఓ. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక పఠనం ఆవశ్యకతను, కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చన్నారు. పుస్తక పఠనం ప్రపంచంతో పరిచయం కలిగిస్తుందని తెలిపారు. దేశవిదేశాల గురించి అవగాహన పెరుగుతుందన్నారు. విద్యార్థులతో జనరల్ నాలెడ్జి కథలు, దినపత్రికలు చదివించారు.

శ్రద్ధాంజలి

26-04-1956
04-02-2024
అందరిని ఆప్యాయంగా చిరునవ్వుతో పలకరిస్తూ, మంచితనానికి మారుపేరుగా నిలిచి మా ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన మీరు లేరనే నిజాన్ని నమ్మలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..
భార్య : అమ్మాజీ
కుమార్తెలు : - అల్లుళ్ళు :
B.Sc. B.Ed. Asst. Executive Officer (GST) State Tax Dept.
M.Sc.,B.Ed., M.C.A. Software Engr.
మనుమలు : (USA)
కుమారుడు : - కోడలు :
M.Tech. Ph.D B.Tech.,
మనుమరాళ్ళు :
పెద్ద కర్మ : తేది. 19-02-2024 సోమవారం అనకాపల్లి మం॥, తుమ్మపాల గ్రా॥, గవరపేట వీధిలో గల మా స్వగృహమందు జరుగును.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com